

వడ్డీ వ్యాపారులపై కొరడా

జిల్లాలో పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో ▸



బిజినెస్ టీచర్ లీలలు

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

38.3 /26.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలుకు కృషి



ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీని అమలు చేసే కృషి చేస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఎన్‌ఆర్‌ఐ పాలసీని తెలంగాణలో అమలు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. దుబాయ్‌లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గల్ఫ్ ప్రవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపుకోసం నిజామాబాద్ ఓటర్లకు అవగాహన కల్పించి తమవంతు కృషి చేయాలని కోరారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై కాంగ్రెస్ అధ్యయనం చేసిందని వారి సమస్యలు పరిష్కరించేవిధంగా త్వరలో కార్యరూపకల్పన చేస్తామని తెలిపారు.

పాఠశాలల మరమ్మతులకు రూ. 39 కోట్లు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులకు జిల్లా విద్యా శాఖ నడుం బిగించింది. వేసవి సెలవుల్లో బడుల్లో మరమ్మతులు చేసేందుకు రూ. 39.53 కోట్లను నిధులను విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 792 ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేయనున్నారు. వీటిలో తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సదుపాయాలు, భవనాల మరమ్మతులు, ఇతర మరమ్మతు పనులు చేపడతారు. ఆయా బడుల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నిధులు కేటాయించనున్నారు. ఆర్మూర్ మండలంలో 40 స్కూల్స్, భీమ్‌గల్‌లో 39, బోధన్ మండలంలో 55, డిచ్‌పల్లిలో 44, మాక్లూర్‌లో 38, నవీపేటలో 39 సిరికొండలో 38 పాఠశాలల్లో పనులను నిర్వహించనున్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కృషి

సుభాష్‌నగర్: సమాజానికి సవాలుగా మారిన మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి అధికారులు కలిసికట్టుగా కృషిచేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై గట్టి నిఘా పెడుతూ, వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఆర్టీసీ, రైల్వే అధికారులు బస్సులు, రైళ్లలో గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి జిల్లాకు చేరుతున్నాయి. ఏయే ప్రాంతాల్లో ఎవరు వీటిని విక్రయిస్తున్నారు. జిల్లా మీదుగా ఎటు రవాణా జరుగుతోంది.. స్థానికంగా గంజాయిని సాగు చేస్తున్నారా అనే వివరాలకు పక్కాగా గుర్తించి అడ్డుకోగలిగితే చాలా వరకు వినియోగాన్ని నియంత్రించవచ్చని సూచించారు. సమావే శంలో అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఏవో వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి.. నేతల హడావుడి

- సాధ్యమైనన్ని చోట్ల సీతారాముల కల్యాణానికి హాజరయ్యేందుకు ఏర్పాట్లు
- ఎన్నికల నేపథ్యంలో పార్టీల అభ్యర్థులతో పాటు నాయకుల పాట్లు
- అయోధ్య ఆలయ ప్రారంభం నుంచి దూకుడు పెంచిన బీజేపీ
- శ్రీరాముడు అందరివాడంటున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు
- నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో తిరుగుతున్న సంఘ్‌పరివార్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అయోధ్యలో శ్రీరాముడి మందిరాన్ని గత జనవరి 22న ప్రారంభించిన నేపథ్యంలో అప్పటి నుంచి దేశ మంతా రామనామం మార్మోగుతోంది. ఈ క్రమంలో కొన్ని రోజుల తేడాతోనే కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల శంఖారావానికి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మధ్యలోనే శ్రీరామనవమి పర్వదినం వస్తోంది. రేపు శ్రీరామనవమి పండుగ కావడంతో అన్ని చోట్ల రాజకీయ పార్టీల శ్రేణుల హడావుడి కనిపిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ల్లో ఉన్న జహీరాబాద్, నిజామాబాద్ లోక్‌సభ స్థా నాల పరిధిలో భక్తి ప్రభావం ఎక్కువ. దీంతో సహజంగానే రామజన్మభూమి అంశం ఈ రెండు స్థానా ల్లో కీలక ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ అంశం తమ పేటెంట్ హక్కు గా భావించే బీజేపీ శ్రేణులు అయోధ్య రామాలయం విషయమై మరింత గట్టిగా ప్రచారం చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. అయోధ్యలో మందిరం ప్రారంభానికి ముందు ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేసే విషయంలో సంఘ్‌పరివార్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకల్లో సైతం తమ ప్రభావం ఉండేలా చూసుకుంటున్నారు. మూడు నెలల క్రితం అయోధ్య బాలరాముడి ఆలయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడం, తా జాగా శ్రీరామనవమి కల్యాణం వాడవాడలా చేయ నుండడంతో ఈ ప్రభావం తమకు బాగానే కలిసొస్తుందని బీజేపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ అంశాన్ని గట్టిగా ఉపయోగించుకునేందుకు నిజామాబాద్, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బీబీ పాటిల్‌లు తమ శ్రేణులను ముందుకు నడిపిస్తున్నా రు. గత శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ మంచి విజయాలను నమోదు చేసుకుంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఫలితం రాబట్టుకునేందుకు అటు బీజేపీ శ్రేణులు, ఇటు సంఘ్‌పరివార్ శ్రేణులు సైతం పకడ్బందీగా వ్యవహరిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఓట్లను భారీగా రాబట్టుకునేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు సైతం..

అయోధ్య రామమందిరం అంశాన్ని, శ్రీరామనవమి ఉత్సవాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్న బీజేపీకి దీటుగా తాము తగ్గేదేలేదంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు, నాయకులు ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నారు. శ్రీరాముడు అందరివాడని, ఒక్క బీజేపీకి మాత్రమే పేటెంట్ కాదంటూ ఈ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలను బీజేపీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకెళ్తోంది. అయితే నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి సురేష్ షెట్కార్ మాత్రం ముస్లిం ఓట్లు తమకే గంపగుత్తగా పడతాయనే ధీమాతో ఉన్నారు. అదేవిధంగా హిందూ ఓట్లలో వివిధ సామాజిక వర్గాల ఓ ట్లు తమకు భారీగా వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సైతం త్రిముఖ పోటీలో తమకు కలిసివస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.

కమీషన్ల ఆశ చూపుతూ..

- ఆరోగ్య సిబ్బందిని మభ్యపెడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు
- రోగిని రెఫర్ చేస్తే డబ్బుల చెల్లింపు!
- చోద్యం చూస్తున్న అధికారులు



నిజామాబాద్‌నాగారం: రోగులను ఆస్పత్రులకు రప్పించుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రులు కొత్తకొత్త దారులు వెతుకుతున్నాయి. ఇన్ని రోజులు ఆర్‌ఎంపీ, పీఎంపీలు పర్సంటేజీలు తీసుకుంటూ ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను రెఫర్ చేయడం తెలిసిందే.. కానీ ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందిని మచ్చిక చేసు కుంటున్నాయి. ఆశ వర్కర్లకు డబ్బులు ఇస్తామని మభ్యపెడుతూ రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయాలని కోరుతున్నాయి. వీరికి హోటళ్లలో పార్టీలు ఇస్తూ నగదు ప్రోత్సాహకాలు అందిస్తు న్నారు. ఒక్కో రోగిని రెఫర్ చేస్తే రూ. 10వేల చొప్పున ముట్టజెబుతామని ఆశ చూపిస్తున్నారు. ఈ తతంగం గురించి తెలిసినా కొంతమంది అధికారులు ముడుపులు అందుకొని చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో వందల ఆస్పత్రులు

నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండానే సూపర్ స్పెషాలిటీ, మల్టీస్పెషాలిటీ బోర్డులు పెట్టి మరీ వైద్యం చేస్తున్నారు. సరైన వైద్యులు లేకున్నా విజిటింగ్ డాక్టర్లను నియమించుకుంటున్నారు. కానీ అత్యవసర సేవలందిస్తామని, 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటారని బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే సుమారు 400 వరకు ప్రైవేటు ఆస్పతులు ఉన్నాయి. పోటీ పెరుగుతుండడంతో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమిషన్‌లు, నజరానాలు, పర్సేంటీజీలు ఇచ్చి మరీ రోగులను రెఫర్ చేయించుకుంటున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలకు టూర్లు, బంగారం, విలువైన సామాగ్రిలు బహుమతులుగా అందిస్తున్నారు. సేవ రూపంలో ఉన్న వైద్యాన్ని కొంతమంది ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వ్యాపారంగా మార్చేశారు.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ఇప్పటికే ఆర్‌ఎంపీ, పీఎంపీల బాగోతం తెలిసినా.. వైద్యాధికారులు తూతూ మాత్రంగా సమావేశాలు పెట్టి మమ అనిపించేశారు. రహస్యంగా సమావేశాలకు రావాలని పిలిచి బేరసారాలు మాట్లాడుకున్నారని శాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. కొంతమంది అధికారులు తనిఖీ పేరుతో వెళ్లి మరీ ప్రతినెలా ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద ముడుపులు సైతం అందుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఆశ కార్యకర్తలు నిక్కచ్చిగా పని చేస్తున్నా వారిని ప్రైవేటు ఆస్పత్రుల మభ్య పెడుతున్నాయి. విషయం తెలిసినా సంబంధిత అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని శాఖలో చర్చజరుగుతోంది. ఇదే విషయమై జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనంను సంప్రదించడానికి ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆశ వర్కర్లను మభ్యపెడుతూ..

కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు రోగులను రెఫర్ చేస్తే డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నాయి. ఆశ కార్యకర్తలు నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తున్నా.. వారిని మార్చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆశలకు హోటళ్లలో బిర్యానీలు తినిపిస్తూ, నగదు ప్రోత్సాహకాలు ఇస్తూ మభ్య పెడుతున్నారు. వారికి ఇష్టం లేకున్నా.. మీకు జీతాలు తక్కువగా ఉంటాయని, ఆలస్యంగా వస్తాయని, ఖర్చులకు ఉపయోగపడతాయంటూ ఆశ చూపిస్తున్నారు. గ్రామాల్లో ఆశ వర్కర్లు, రోగులకు దగ్గరి మంచి సంబంధాలు ఉంటాయి. దీనిని కార్పొరేట్ ఆస్ప త్రులు అవకాశంగా మల్చుకుంటున్నా యి. ఆశ కార్యకర్తలను మభ్యపెట్టి వారితో రోగులను రెఫర్ చేయించుకుంటున్నారు.

ఎన్నికల్లో తప్పిదాలకు తావుండొద్దు

- ఏవైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురండి
- అధికారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల కానుండగా, ఆ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా చేపట్టిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, స్వీప్ అధికారి సురేష్ కుమార్, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి బల్దియా హస్తగతం!

- చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ఎన్నిక
- నిరాశతో వెనుదిరిగిన కౌన్సిలర్ వనిత వర్గం
- సమావేశానికి హాజరుకాని బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు



ప్రమాణస్వీకారం చేస్తున్న ఇందుప్రియ

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ సభ్యులు బల్దియా చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై గతనెల 30వ తేదీన అవిశ్వాసం ప్రవేశపెట్టగా.. కొందరు బీఆర్‌ఎస్ సభ్యులు మద్దతు ఇవ్వడంతో అవిశ్వాసం నెగ్గింది. దీంతో నూతన చైర్‌పర్సన్ ఎన్నిక కోసం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి బీఆర్‌ఎస్, బీజేపీ ప్రయత్నాలు చేయడం, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు పదవిని ఆశించడంతో బల్దియా రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. కాంగ్రెస్ సభ్యులు క్యాంప్‌నకు వెళ్లారు.

సీల్డ్ కవర్‌లో అభ్యర్థి పేరు..

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులున్నాయి. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్నారు. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం 26 మంది సభ్యుల కోరం అవసరం. కాగా సోమవారం ఆర్డీవో రఘునాథ్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కాంగ్రెస్ క్యాంపులో ఉన్న 28 మంది కౌన్సిలర్లు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక బస్సులో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు సమావేశానికి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్‌నుంచి ఇద్దరు పదవిని ఆశించడంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం సీల్డ్ కవర్‌లో అభ్యర్థి పేరును పంపింది. సీల్డ్ కవర్‌లో వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పేరుండడంతో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. 48వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అన్వర్ అహ్మద్, 38వ వార్డు కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్‌లు ఆమె పేరును ప్రతిపాదించగా.. సభ్యులంతా చేతిలెత్తి ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఇందుప్రియ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. ఎన్నిక పత్రాన్ని అందించి, ప్రమాణ స్వీకారం చేయించారు.

అవాక్కయిన పదో వార్డు కౌన్సిలర్..

ఇందుప్రియతో పాటు పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత చైర్‌పర్సన్ పదవిని ఆశించారు. అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఇరువురు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని క్యాంపులో ఇరువర్గాల మధ్య గొడవ కూడా జరిగినట్లు తెలిసింది. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇరు వర్గాలను సముదాయించినట్లు సమాచారం. ఇందుప్రియను ఎంపిక చేసి సీల్డ్ కవర్‌లో ఆమె పేరును పంపించింది. చివరి క్షణంలో ఇందుప్రియ పేరు ప్రకటించడంతో వనితతో పాటు ఆమె వర్గం కౌన్సిలర్లు అవాక్కయ్యారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం వనితతో పాటు ఒక్కరొక్కరుగా 12 మంది కౌన్సిలర్లు అక్కడి నుంచి నిరాశతో వెళ్లిపోయారు.

'కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న బాజిరెడ్డి గోవర్ధన్, కేఆర్ సురేశ్‌రెడ్డి

భీమ్‌గల్: దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. భీమ్‌గల్‌లో సోమవారం జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడు పార్టీ మారుతున్న అవకాశవాదులు రానున్న రోజుల్లో బాధపడతారని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎప్పుడైన ఈ ప్రాంత ప్రజల కష్టాసుఖాల్లో పాలు పంచుకున్నారా అని ప్రశ్నించారు. అహంకారి అయిన అర్వింద్‌ను ఓడించి, అనుభవజ్ఞుడైన బాజిరెడ్డి గోవర్ధన్‌ను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నప్పుడే హామీలు సరిగా అమలు చేయని కాంగ్రెస్ ఎన్నికలయ్యాక అమలు చేస్తుందా అని ప్రజలు ఆలోచించాలన్నారు. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలపై ప్రతి గ్రామంలో చర్చ పెట్టాలన్నారు. ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నుంచి చెత్త పోతుందని, దీంతో ఎలాంటి నష్టం లేదన్నారు. నికార్సైన కార్యకర్తలు మనతోనే ఉన్నారన్నారు. మచ్చలేని నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు టీచర్ శ్రీనివాస్ శర్మ సస్పెండ్ అయ్యారు. ఈ విషయాన్ని డీఈవో ఎస్.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆయనపై చర్యలు తీసుకున్నామని డీఈవో పేర్కొన్నారు.

ఇందూరులోనే పసుపుబోర్డు పెట్టిస్తా..

- రాముడిని పూజిద్దాం.. బీజేపీని గద్దెదించుదాం
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ ఎంపీగా తనను గెలిపిస్తే ఇందూరు గడ్డపైనే పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో మోపాల్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు సందగిరి భూమరెడ్డి, బీజేపీ నుంచి మేక బాగారెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 2025లోపు నిజాంషుగర్స్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తానని పేర్కొన్నారు. మూతపడ్డ పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెరిపించి కార్మికులకు, రైతాంగానికి ప్రయోజనం చేకూర్చుస్తామన్నారు. కవితపై ఉన్న వ్యతిరేకతతోనే అర్వింద్ ఎంపీగా గెలిచాడని.. కానీ బీజేపీ, మోడీపై అభిమానంతో కాదన్నారు. వాపును చూసి అర్వింద్ బలుపు అనుకుంటున్నాడన్నారు. ఇందూరు సమస్యలను పార్లమెంట్‌లో గళమెత్తి పరిష్కరిస్తానని, నిజామాబాద్‌ను దేశంలోనే గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాముడిని పూజిద్దామని.. మోదీని గద్దెదించుదామనే నినాదంతో ముందుకు సాగుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, పీసీసీ నాయకులు నగేశ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, నాయకులు ముప్ప గంగారెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన భూమారెడ్డి

కాంగ్రెస్ మునిగిపోయే పడవ



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్, చిత్రంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి

- కులాలు, మతాల పేరుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాజకీయాలు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

ఆర్మూర్: కాంగ్రెస్ మునిగిపోయే పడవ అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని సప్తగిరి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ అస్తిత్వాన్ని కాపాడడంలో భాగంగా ఉమ్మడి పౌరసత్వ చట్టం అమలులోకి తీసుకువచ్చే రోజులు రానున్నాయని చెప్పారు. కులాలు, మతాల పేరుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం తెలంగాణలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. బీఆర్‌ఎస్ చచ్చిన పాము అని, కాంగ్రెస్ మునిగిపోయే పడవ అన్నారు. మోదీ దేశ ప్రజల అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తుంటే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు వారి వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అడగాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ మాత్రమే మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని ప్రజలకు నమ్మకం ఉందన్నారు. బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిర్మల్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 17 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. బ్యూటీ పార్లర్, మగ్గంవర్క్, టైలరింగ్ (30 రోజులు) కోర్సుల్లో శిక్షణనిస్తారని వివరించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు (19 నుంచి 45 ఏళ్ల వయస్సు) శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకునివచ్చి ఆర్‌ఎస్‌ఈటీఐలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ధ్రువీకరణపత్రం, టూల్ కిట్ అందజేస్తామని, ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కోరారు. పూర్తి వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫీజు కట్టలేదని పరీక్షకు అనుమతి నిరాకరణ

నిజామాబాద్‌అర్బన్: ఫీజు చెల్లించలేదని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను సమ్మెటీవ్-2 పరీక్షకు సోమవారం అనుమతించలేదు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అక్రిడ్జ్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఫీజు చెల్లించలేదు. తల్లిదండ్రులు వచ్చి బతిమాలినప్పటికీ వినకపోవడంతో విద్యార్థులు పరీక్షరాయకుండానే వెనుదిరిగారు. ఈ విషయమై తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. అలాగే నగరంలోని షైన్ స్టార్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదు. దీంతో వారి తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా చివరి క్షణంలో పరీక్షకు అనుమతించారు. విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన ప్రైవేట్‌పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.

న్యాయం చేయాలని వినతి

కామారెడ్డి అర్బన్: కొందరు పెద్దమనుషులు తనపై కక్షగట్టి చేపలు వేటాడకుండా సొసైటీ నుంచి బహిష్కరించారని నిజాంసాగర్ మండలం మల్లూర్‌కు చెందిన మత్స్యకారుడు పొట్టినాగి బాల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారికి విజ్ఞప్తి చేశాడు. మల్లూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో తనకు సభ్యత్వం ఉందని, సయ్యని మైసయ్య, గిర్ని అంజయ్య, గులింగి దుర్గయ్య తనపై కక్షతో సొసైటీలో వాటా ఇవ్వకుండా బహిష్కరించినట్లు తెలిపాడు. చేపల చెరువును ఇతరులకు గుత్తాకు ఇచ్చారని బాల్‌రాజ్ ఆరోపించాడు. తన తల్లి వికలాంగురాలు కాగా తండ్రి చనిపోయాడని, తన పరిస్థితి బాగోలేదని, తనకు న్యాయం చేయాలని విన్నవించాడు.

ట్రేడ్ టెస్ట్‌కు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐకి సంబంధించి ఏదైనా ట్రేడ్లలో అనుభవం ఉన్న వారు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు(ఏఐటీటీ) హాజరయ్యే అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఏదైనా ట్రేడ్‌కు సంబంధించిన ప్రైవేట్ లేదా గవర్నమెంట్ సంస్థల్లో మూడు సంవత్సరాల అనుభవం ఉండి.. సంబంధిత ట్రేడ్లలో సర్టిఫికెట్ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీలోగా వరంగల్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్తీర్ణత అవకాశాన్ని బట్టి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94417 84849 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా

- 40 చోట్ల దాడులు.. 30 కేసులు నమోదు
- వ్యాపారుల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు
- ప్రామిసరీ నోట్‌లు, పట్టాపాస్ పుస్తకాలు, ఏటీఎం కార్డులు, నగదు స్వాధీనం


రెండో పోలీసు స్టేషన్ పరిధిలో వడ్డీ వ్యాపారి ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భీమ్‌గల్/ఆర్మూర్‌టౌన్/బోధన్ టౌన్/రుద్రూర్/సిరికొండ/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: వడ్డీ వ్యాపారులు తమ వద్ద అప్పు తీసుకున్న వారిపై దాడులు, వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు చేసి 30 కేసులు నమోదు చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం నుంచి దాడులు కొనసాగాయి. వడ్డీ వ్యాపారుల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులు ప్రామిసరీ నోట్‌లు, పట్టాపాస్‌పుస్తకాలు, ఏటీఎం కార్డులు, నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.2 నుంచి రూ.20 వరకు వడ్డీ వసూలు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు మనీలాండరింగ్ ఆక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు.

భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. బెజ్జోర గ్రామానికి చెందిన సుంకం భాస్కర్, భీమ్‌గల్ ప్రాంతానికి చెందిన కవిత సాగర్, కర్నె పోశెట్టి, పురస్తు నడిపి నరేశ్‌పై కేసులు నమోదయ్యాయన్నారు. ఆర్మూర్ పట్టణంలో అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. బోధన్ పట్టణంలోని గోశాల, హనుమాన్ టేక్డి, శక్కర్‌నగర్ చౌరస్తా ప్రాంతాలకు చెందిన ఐదుగురి ఇళ్లలో స్థానిక పోలీసుల సహకారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. రుద్రూర్ సర్కిల్ పరిధిలోని వర్ని, పొతంగల్, రుద్రూర్ మండలాల్లో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, ఫైనాన్స్ కార్యాలయాలపై దాడులు చేశారు. ఐదు కేసులు నమోదు చేసినట్లు సీఐ జయేశ్‌రెడ్డి తెలిపారు. సిరికొండలో రెండు ఇళ్లపైదాడులు చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన చౌకి హన్మంతు ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు రూ.7.96లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. హన్మంతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మండలంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడి చేశారు. జక్రాన్ పల్లి మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మడవేరి రఘు, శంకర్ ఇళ్లలో సోదాలు చేసి, ప్రామిసరీ నోట్‌లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామన్నారు.

నామమాత్రపు దాడులేనా..?

మోర్తాడ్/ఖలీల్‌వాడి: జిల్లాలో వడ్డీ వ్యాపారుల సంఖ్యకు, పోలీసులు తనిఖీ చేసిన ఇళ్ల సంఖ్యకు ఎంతో తేడా ఉందని.. ఇవి నామమాత్రపు దాడులేననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో పోలీసులు సోమవారం 30 కేసులు నమోదు చేయగా, వారంతా సాదాసీదా వ్యాపారులేనని తేటతెల్లమవుతోంది. అప్పులు తీసుకున్న వారి నుంచి భూమి విక్రయించినట్లు సంతకాలు తీసుకొని భూమి విలువలో 70శాతం డబ్బులు ఇచ్చే వ్యాపారులు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. ప్రత్యేకించి ఓ సామాజిక వర్గానికి చెందిన వారు భారీగా వడ్డీ వ్యాపారం చేస్తున్నా వారి ఇళ్లపై దాడులు చేయలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలువురు నెలకు నూటికి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. సోమవారం జిల్లాలో పోలీసులు దాడులు నిర్వహించినప్పటికీ.. కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, ఆర్మూర్, మోర్తాడ్, జక్రాన్‌పల్లి, వేల్పూర్ తదితర ప్రాంతాల్లో కీలకమైన వడ్డీ వ్యాపారులు తప్పించుకున్నట్లు సమాచారం. కొంత మంది మాత్రమే పోలీసులకు పట్టుబడ్డారని, అసలు వ్యాపారులు అప్రమత్తమయ్యారని పలువురు పేర్కొంటున్నారు. పోలీసుల దాడుల నేపథ్యంలో వడ్డీ వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటారని, పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరిస్తూ పకడ్బందీ దాడులు నిర్వహిస్తేనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: రెండు క్రితం జిల్లాలో కురిసిన వర్షంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ నుంచి 3,472 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే యాసంగి సీజన్‌లో చివరితడి కోసం ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీటివిడుదల కొనసాగుతోంది. కాక తీయ కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 271 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90 టీ ఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1058.10(11.2 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఖలీల్‌వాడి: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, రిలయన్స్ మాల్, అపార్ట్‌మెంట్లు, కంఠేశ్వర్ బైపాస్ వద్ద ప్రజలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు, సిలెండర్‌తో మంటలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలో అగ్నిమాపక సిబ్బంది విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది మధు, ప్రషత్, ప్రషల్‌గౌడ్, సురేష్, వినోద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ టీచర్ లీలలు

- ఎస్‌ఎల్‌వీఎస్ పేరిట చిట్‌ఫండ్ కంపెనీ
- 10 పట్టణాల్లో బ్రాంచ్‌లు, వందల మంది కస్టమర్లు
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితులతో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో

కామారెడ్డి క్రైం: అతనో బాధ్యత గల ఉపాధ్యాయుడు. అత్యాశతో చిట్టీలు నిర్వహించి, ఖాతాదారులను మోసగించి చివరికి జైలు పాలయ్యాడు. తనతోపాటు కుటుంబ సభ్యులనూ జైలు ఊచలు లెక్కింపజేస్తున్నాడు. కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డికి చెందిన బిల్ల దశరథ్‌రెడ్డి ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన తన భార్య పద్మావతి, కుమారుడు నితీష్‌రెడ్డిల పేరిట హైదరాబాద్ రోడ్డులోని ఓ భవనంలో ఎస్‌ఎల్‌వీఎస్ చిట్‌ఫండ్ కంపనీ ఏర్పాటు చేశారు. ఎస్‌ఎల్‌వీఎస్ పేరు మీద కామారెడ్డితో పాటు నిజామాబాద్, కొంపల్లి, షాద్‌నగర్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, మెట్‌పల్లి, వనపర్తి తదితర పట్టణాల్లో బ్రాంచ్‌లు తెరిచారు. ఏజెంట్‌ల ద్వారా వందల సంఖ్యలో కస్టమర్లను చేర్చుకున్నారు. చిట్‌ఫండ్ నిర్వాహకులు 30 వరకు చిట్టీలు నడిపించినట్లు తెలుస్తోంది. సదరు చిట్‌ఫండ్ కంపెనీలో పట్టణానికి చెందిన అహ్మద్ మోహీయుద్దీన్ రెండు చిట్టీలు వేశాడు. చీటీ కాలం పూర్తయినా డబ్బులు ఇవ్వలేదు. చాలాసార్లు అడిగినా స్పందన లేకపోవడంతో విసిగిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా చిట్‌ఫండ్ కంపెనీ పేరిట జరుగుతున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి.

బాధితుల స్టేట్‌మెంట్లను నమోదు చేశామని, ఒక్క కామారెడ్డిలోనే దాదాపు రూ. 2 కోట్ల మేర మోసం జరిగినట్లు తెలుస్తోందని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్ని బ్రాంచ్‌లలో క లిపి రూ.50 కోట్ల వరకు కస్టమర్లకు టోకరా వే సినట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన దశరథరెడ్డితోపాటు అతడి భార్య ప ద్మావతి, కుమారులు నితీశ్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

భార్యకు గుండెపోటు.. సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన భర్త

నవీపేట: భార్యకు గుండెపోటురాగా భర్త సీపీఆర్ చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి హామీ కూలీ ర్యాగల్ల లావణ్య చెరువులో పూడిక తీత పనులకు వెళ్లింది. పని చేస్తుండగా ఒక్కసారిగా వాంతులు చేసుకొని అస్వస్థతకు గురైంది. తోటి కూలీలు వెంటనే ఆమె భర్త రాజశేఖర్‌కు ఫోన్‌లో తెలుపగా, ఆయన ఘటనాస్థలానికి చేరుకున్నాడు. వృత్తిరీత్యా ఆర్‌ఎంపీ అయిన రాజశేఖర్ కొనఊపిరితో కొట్టుఉంటున్న తన భార్యకు సీపీఆర్ చేశాడు. 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లావణ్య చికిత్స పొందుతోంది.

ఇసుక వేలం

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఇసుక వేలం పాట నిర్వహించారు. మూడు ట్రాక్టర్ల ఇసుకను రూ.12,100కు విక్రయించినట్లు డీటీ తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి సీపీఆర్ శిక్షణ

నిజామాబాద్‌నాగారం: ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది, ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ తెలిపారు. నిజామాబాద్‌రూరల్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందికి సోమవారం జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. అనంతరం సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్‌ను కచ్చితంగా పటించాలని, 11కేవీ, 33కేవీ ఫీడర్లను సరి చూసుకోవాలన్నారు. గృహ వినియోగదారులు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ సూచించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ రవీందర్

25వరకు శిక్షణ

ఈ నెల 15 నుంచి 25వ తేదీవరకు జిల్లాలోని సబ్ డివిజన్లలో రెడ్‌క్రాస్ సహకారంతో సీపీఆర్ శిక్షణ కొనసాగుతుందని ఎస్‌ఈ తెలిపారు. డాక్టర్ శ్రీశైలం సిబ్బందికి ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ వెంకటరమణ, డిచ్‌పల్లి డీఈ ఉత్తం జాడే, నిజామాబాద్‌రూరల్ ఏడీఈ బాలేశ్‌కుమార్, టెక్నికల్ ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి , టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్, పీవో పోశెట్టి, మాస్టర్ ట్రైనర్లు లక్ష్మణ్, పెంటయ్యాచారి, ఎస్‌ఎల్‌ఐ శంకర్ నాయక్, లింగం పాల్గొన్నారు. వందమంది ఉద్యోగులు, సిబ్బంది శిక్షణ పొందారు.

తండ్రి మరణం.. బెంగతో కూతురి ఆత్మహత్య


మేఘన (ఫైల్)

ఎడపల్లి(బోధన్): తండ్రి మరణం, ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో మానసికంగా కుంగిపోయిన కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 15 ఏళ్ల క్రితం కూనమనేని శ్రీనివాస్ కుటుంబం ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి ఎడపల్లిలో స్థిర పడింది. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం కూనమనేని శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుమార్తె మేఘన తండ్రిపై బెంగపెట్టుకొని మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోలేదని తల్లి మాట్లాడుతుండగా విన్న మేఘన మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనాస్థలాన్ని బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్ పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పు తీర్చలేక ఒకరు..

రుద్రూర్ : అప్పు తీర్చేమార్గంలేక జీవితంపై విరక్తి చెంది వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందూర్ గ్రామానికి చెందిన మమ్మాయి గిరి (46) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ సోమవారం తెలిపారు. మద్యానికి బానిసైన గిరి అప్పులు చేశాడని, జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకున్నాడన్నారు. మృతుడి భార్య మమ్మాయి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

అప్పు తీర్చమన్నందుకు హతమార్చారు

- హత్యకేసులో భార్యాభర్తల అరెస్ట్
- ఈనెల 10న హత్యకు గురైన మహిళ

నవీపేట : మండలంలోని కోస్లీ శివారులో ఉన్న అలీసాగర్ కాలువలో ఈనెల 10వ తేదీన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పుతీర్చమన్నందుకు సదరు మహిళను హత్య చేశారని తేల్చారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన చంద్రకళ వద్ద అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు గోదావరి, గంగాధర్ రూ.50వేలు అప్పుగా తీసుకున్నారు. గడువు సమీపిస్తున్న తరుణంలో డబ్బులు తిరిగిచెల్లించాలని చంద్రకళ వారిని కోరగా, వారు సమాధానం ఇవ్వలేదు. చంద్రకళను హతమార్చాలని పథకం పన్నిన గోదావరి, గంగాధర్ ఈనెల 10న ఆమెను డబ్బులు చెల్లిస్తామని ఇంటికి రప్పించి గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. ఆ తరువాత ద్విచక్రవాహనంపై చంద్రకళ మృతదేహాన్ని తీసుకువచ్చి అలీసాగర్ కాలువలో పారేశారు. నిందితులైన భార్యాభర్తలు గోదావరి, గంగాధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఎలుగుబంటి దాడి



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామా నికి చెందిన మొగుల్ల బాలాగౌడ్‌పై ఎలుగుబంటి దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. మతిస్థిమితం లేని బాలాగౌడ్ ఎల్లప్పుడూ బయటతిరిగేవాడని, ఆదివారం రాత్రి అటవీప్రాంతంలో ఎలుగుబంటి దాడి చేసిందన్నారు. సోమవారం గాయాలతో గ్రామంలోకి వచ్చాడని, అతడిని ప్రశ్నించగా.. ఎలుగుబంటి దాడి చేసినట్లు చెప్పాడన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించారు.

అనారోగ్యంతో మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి


సులోచన(ఫైల్)

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తమ్మేవార్ నాగ్‌నాథ్ సేట్ సతీమణి తమ్మేవార్ సులోచన(97) సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన నాగ్‌నాథ్ సేట్ కాంగ్రెస్‌లో ఉంటూ 1962 నుంచి 1967 వరకు ఎమ్మెల్యేగా సేవలందించారు. 2005లో ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. సులోచన కర్ణాటకలోని గుల్బర్గాలోని కూతురు వద్ద మృతి చెందారని, అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్..


నక్కవార్ లక్ష్మణ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్కవార్ లక్ష్మణ్(80)ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారా వు మండల కేంద్రంలో లక్ష్మణ్ మృతదేహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.లక్ష్మణ్ మృతి పార్టీకి తీరని లోటన్నా రు.ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు సాయి లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, నాయకులు రమేశ్, జావీద్‌పటేల్, లక్ష్మణ్ ఉన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

గాంధారి: మండల కేంద్రంలోని సోయక్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన సోయక్ పాషా వారంరోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. దుండగుడు తాళం పగులగొట్టి ఇంట్లోని నగదు, బంగారంతోపాటు ఇతర విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వల్లెపు కాశీరాం చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. బాన్సువాడలోని బంధువుల ఇంట్లో ఉన్న కాశీరాంను సోమవారం అదుపులోకి తీసుకొని చోరీ చేసిన సొత్తుతోపాటు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాశీరాం పాత నేరస్తుడని, అతడిపై ఇదివరకు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. గతంలో పీడీ యాక్ట్ నమోదు కాగా, సంవత్సరం పాటు జైలు జీవితాన్ని గడిపినట్లు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం కారేగాం - హంగర్గా రోడ్డుపై సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారేగాంకు చెందిన శివకుమార్ (37) మృతి చెందాడు. ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కారేగాం నుంచి శివకుమార్ తన భార్యతో కలిసి పొతంగల్ వారసంతకు బయల్దేరగా, చేతన్‌నగర్‌కు చెందిన స్నేహితులు ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో శివకుమార్‌తో పాటు అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శివకుమార్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

చెరువులోపడి యువకుడు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన పయ్యావుల రవితేజ (17) చెరువులోపడి మృతి చెందినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చెరువు వైపు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి ఆదివారం సాయంత్రం బయటికి వెళ్లిన రవితేజ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. రవితేజ ఆచూకీ లభించకపోవడంతో అతడి మేనమామ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం బర్ధిపూర్ చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నీటిలో రవితేజ మృతదేహం లభించడంతో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవితేజది ఆత్మహత్యా? లేక ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడా? అనేది దర్యాప్తులో తేలుతుందని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో లేగదూడ మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సురాయిపల్లితండాకు చెందిన గుగులోత్ దేవులాకు చెందిన లేగదూడ విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. మేతకు వెళ్లిన లేగదూడ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి మృతి చెందిందన్నారు. మృతి చెందిన లేగదూడ విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

రేషన్ దుకాణాల తనిఖీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధి కారులు సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలోని ఐదో నంబర్ దుకాణంలో రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, ఏసీఎస్‌వో సుదర్శన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి సోమవారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి మార్నింగ్ కోర్టులో హాజరుపర్చామన్నారు. మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ 25 మందికి రూ.24100 జరిమానా విధించారని, మరో ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని తెలిపారు.

ఐదో టౌన్‌పరిధిలో..

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

నలుగురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ మజార్ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గొడవల కారణంగా మజార్ భార్య గత 5 సంవత్సరాలుగా మరోచోట ఉంటోందన్నారు. డ్రైవర్‌గా పని చేసే మజార్ మార్చి 30న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో తల్లి ఫాతిమాబీ ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి..

పట్టణంలోని పీఎంహెచ్ కాలనీకి చెందిన మహ్మద్ రహీం అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 13 న చేపలు పట్టడానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన రహీం తిరిగి రాలేదన్నారు. ఆచూకీ లభించకపోవడంతో రహీం భార్య కమ్రున్నీసా ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గొల్లపల్లికి చెందిన మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని గొల్లపల్లికి చెందిన గంగలక్ష్మి అదృశ్యమైనట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గంగలక్ష్మి తిరిగిరాకపోవడంతో తల్లి నర్సవ్వ ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లింగారెడ్డిపేటకు చెందిన..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేటకు చెందిన మార్గం భాగ్య అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తన గొడవపడిన భాగ్య ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని ఆమె భర్త సిద్ధయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.